www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 26 నవంబర్ 2024

5

చిత్తూరు



ఆలకించి.. పరిష్కరించండి..

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 175 అర్జీలు


అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 175 ఫిర్యాదులు అందాయి. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధపెట్టి బాధ్యతతో పనిచేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా సచివాలయంలోని నూతన గ్రీవెన్స్‌హాల్‌లో కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి, డిఆర్‌ఓ కె.మోహన్ కుమార్, చిత్తూరు ఆర్‌డిఓ శ్రీనివాసులు, ఏవో కులశేఖర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందే ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరించాలని, అర్జీల పరిష్కారంలో క్షేత్రస్థాయిలో అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకుని అర్థవంతమైన సమాధానాలు ఇవ్వాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కారప్రగతిని ప్రతివారం సమీక్షించడం జరుగుతుందని, అర్జీలు రీ-ఓపెన్ అయినట్లైతే వాటికి గల కారణాలను వివరించాల్సి ఉంటుందన్నారు. ఈ వారం కూడా రెవెన్యూకు సంబంధించిన సమస్యలపై 151 ఫిర్యాదులు అందాయని తెలిపారు.

సమస్యలు ఆలకించి.. పరిష్కరించండయ్యా..

సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదికలో కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలు ఆలకించి పరిక్షరించండయ్యా అంటూ ప్రజలు వేడుకుంటున్నారు. పులిచెర్ల మండలం రాయవారిపల్లికి చెందిన జి. సుబ్బయ్య నాయుడు తనకు రాయవారిపల్లి గ్రామ రెవెన్యూ లెక్క దాఖలా వ.సం 151/11లో 2.75 సెంట్ల భూమి ఉన్నదని, పట్టాదారు పాస్‌బుక్ కూడా ఉందని, తన భూమిలో పంట చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. అయితే సదరు భూమిని కొందరు దౌర్జన్యంగా ఆక్రమించారని, తమకు న్యాయం చేయాలని కోరారు. జిడి నెల్లూరు మండలం వరత్తూరుకు చెందిన పి.నాగరాజ నాయుడు వరత్తూరులో శ్మశానానికి స్థలం కేటాయించాలని కోరారు. పెద్దపంజాణి మండలం పెద్దారగుంటకు చెందిన టి.పద్మావతి తనకు కళ్ళు సరిగా కనిపించవని, తన భర్త చనిపోయారని, తన జీవనానికి ఎటువంటి ఆధారం లేదని, ప్రభుత్వం మంజూరు చేసే వితంతు పెన్షన్ మంజూరు చేయాలన్నారు.

పుంగనూరు మండలం మంగళం గ్రామానికి చెందిన డి.లోకనాథం తనకు గ్రామంలో డికెటి వ్యవసాయ భూమికి దారి సమస్య పరిష్కరించాలని కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. యాదమరి మండలం ఆరిమాకులపల్లె గ్రామానికి చెందిన ఎం.గీత తన గ్రామంలో సర్వేనెం: 368/1లో 2.28 ఎకరాలు, 348/1లో 1.82 ఎకరాలు, 369/1లో 1.61 ఎకరాలు, 349/4లో 1.02 ఎకరాలు, 356/1 లోని 1.54 సెంట్ల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అయ్యిందని ప్రభుత్వ భూమిని కాపాడాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

వేగంగా సమస్యల పరిష్కారం : కమిషనర్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో అందే వినతులను వేగంగా పరిష్కరించాలని కమిషనర్ పి. నరసింహ ప్రసాద్ తెలిపారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కమిషనర్ మాట్లాడుతూ వినతలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. పరిష్కరించిన సమస్యలను ఎండార్స్మెంట్లు జతచేసి సమర్పించాలన్నారు. గత వారం అందిన సమస్యల పరిష్కారంపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ 1, ఫించన్ విభాగం 1 చొప్పున మొత్తం రెండు వినతులు అందాయి. కార్యక్రమంలో ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, అధికారులు పాల్గొన్నారు.

త్వరితగతిన విచారణ : ఎస్పీ


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పి మణికంఠ చందోలు ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలను ఎస్పీ, అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ ఎస్ఆర్.రాజశేఖర్ రాజు చిత్తూరు డీఎస్పీ టి.సాయినాథ్‌ని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి, త్వరితగతిన విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయడమే తమ లక్ష్యమని ఎస్పి తెలిపారు.

ప్రజాధనం వృథా..

- వెలుగుతూనే ఉన్న వీధి లైట్లు
- కోట్లల్లో విద్యుత్ బకాయిలు
- అధికారుల నిర్లక్ష్యం



పుల్లూరు క్రాస్‌లో పగటిపూట వెలుగుతున్న లైట్లు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం

గ్రామాల్లో వీధి దీపాలు విశ్రాంతి లేకుండా రాత్రింబవళ్లు వెలుగుతూనే ఉన్నాయి. యంత్రమైనా.. మనుషులైనా విశ్రాంతి లేకుండా పనిచేస్తూనే ఉంటే వాటి మనుగడ సాగడం అసాధ్యం.. స్ట్రీట్ లైట్లు రెస్ట్ లేకుండా వెలుగుతూనే ఉండటంతో అవి ఎన్ని రోజులపాటు పనిచేస్తాయో తెలీని పరిస్థితి.. సాధారణంగా వీధి దీపాలు సాయంత్రం నుంచి మరుసటి రోజు తెల్లవారు జాము వరకు విద్యుత్ సిబ్బంది నిర్వహిస్తూ ఉంటారు.. అయితే కొన్ని చోట్ల డైరెక్ట్ కనెక్షన్ ఇవ్వడంతో అవి నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి.. దీంతో పంచాయతీలకు కరెంట్ బిల్లు తడిసిమోపడవుతోంది.. కేవలం విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజాధనం వృథా అవుతోందని పలు గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు..

మండలంలో 23 గ్రామ పంచాయతీలకు గాను 13 గ్రామ సచివాలయాలు ఉన్నాయి.. గ్రామ పంచాయతీలకు సంబంధించిన కరెంట్ సర్వీసులు మొత్తం 406 ఉన్నాయి. అక్టోబర్ ఒకటవ తేదీ నాటికి ఎస్ఆర్ పురం మండలానికి సంబంధించిన గ్రామపంచాయతీ కరెంటు బిల్లుల బకాయిలు విద్యుత్ శాఖ తెలిపిన వివరాల మేరకు రూ.18,84,60,542లు ఉన్నాయి. ప్రతి గ్రామపచాయతీలో ఉన్న వీధి దీపాలను కంట్రోల్ చేసే ఆన్ ఆఫ్ స్విచ్ ఏర్పాటు చేస్తే కొంతవరకు ప్రజలపై విద్యుత్ భారం తగ్గించవచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ప్రతి గ్రామసచివాలయంలో ఉన్న గ్రామాల్లఓ అవసరమైనచోట పంచాయతీ వారు వీధి దీపాలను అమర్చారు. వీటికి విద్యుత్ శాఖ కరెంట్‌ను అందించింది.. కానీ వీధి దీపాలు రాత్రి వేళ్లలో మాత్రమే వెలికేగా నిర్వహణ, లైట్స్ ఆన్ అండ్ ఆఫ్ స్విచ్‌లను మాత్రం అమర్చడం మరిచారు విద్యుత్ అధకారులు. దీంతో వీధి దీపాలు నిరంతరం విశ్రాంతి లేకుండా వెలుగుతూనే ఉన్నాయి. దీంతో తరచూ మరమ్మతులకు గురైతున్నాయి. ఇదిలా ఉండా విద్యుత్ బిల్లుల పంచాయతీకి భారీగా వస్తోంది. మండలంలోని గ్రామపంచాయతీలు విద్యుత్ శాఖకు కోట్లల్లో బకాయిలు ఉన్నాయి. ఈ కరెంట్ బిల్లులను ఆదా చేస్తే.. ఆ నిధులను పంచాయతీల అభివృద్ధికి ఉపయోగపడుతుందని.. అలా కాకుండా అధికారుల నిర్లక్ష్యం మూలన ప్రజాధనం వృథా అవుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు సైతం కరెంట్ బిల్లులు చెల్లించేటప్పుడు కరెంట్ ఛార్జీలా అంటూ నోర్లువెళ్లబెట్టాల్సిన పరిస్థితి ఉంది. ప్రస్తుతం కరెంట్ ఛార్జీలు సైతం ఆన్‌లైన్ చేయడంతో ప్రతినెలా కరెంట్ బిల్లు ఆయా పంచాయతీ కార్యదర్శుల మొబైల్ ఫోన్లకు వస్తూనే ఉంది. బిల్లు మొత్తం చూసిన వెంటనే అయ్యో ఇంత కరెంట్ బిల్లు వచ్చిందా అంటూ వారు సైతం షాక్ అవుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు, విద్యుత్ అధికారులు స్పందించి వీధిదీపాల నిర్వహణ సక్రమంగా చేపట్టి విద్యుత్తు వృథాను అరికట్టడం వలన విద్యుత్ ఆదాతోపాటు ప్రజాధనం కూడా వృథా కాకుండా వుంటుందని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.


PANCHYAT ARREARS AS ON 19.10.2024 S.R.R.PURAM SECTION

పంచాయతీ వారీగా అక్టోబర్ ఒకటవ తేదీ నాటికి విద్యుత్ బకాయి లిస్ట్

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

- రెండు నెలలుగా అందని సర్వే రిపోర్ట్
- కలెక్టర్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: బంగారుపాళ్యం మండలం మొగిలి సర్వే నంబర్ 61లో యానాదుల భూమి వారికే కేటాయించాలని రెండు నెలల క్రితం కలెక్టర్‌కి ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించిన కలెక్టర్ డిప్యూటీ కలెక్టర్‌తో సర్వే చేయించడం జరిగింది. అయితే ఆ రిపోర్టును ఇప్పటివరకు జిల్లా కలెక్టర్‌కి పంపకపోవడం దారుణమని సోమవారం సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొగిలి సర్వే నంబర్ 61 ఊరగుట్ట 59 ఎకరాల స్థలంలో యానాదులు గొర్రెలు, మేకలు, ఆవులు మేపుకుంటున్న భూమితోపాటు శ్మశానాన్ని కూడా కొందరు ఆక్రమించుకున్నారని తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతులను అందించారని, ఈ సందర్భంగా కలెక్టర్ వెంటనే స్పందించి అధికారులతో సర్వే చేయించడం జరిగిందన్నారు. సర్వే చేసిన అధికారులు 59 ఎకరాలలో 60 సెంట్లు శ్మశానంకు కేటాయిస్తున్నట్లు స్కెచ్ ఇచ్చి ఎలాంటి కంచెను వేయలేదన్నారు. మిగిలిన భూమిలో 12 మంది ఆక్రమణదారులు ఉన్నారని రిపోర్టు తయారు చేశారు. అయితే ఈ రిపోర్టును ఇప్పటి వరకు జిల్లా కలెక్టర్‌కి పంపకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నదని విమర్శించారు. తహాశీల్దార్‌ని సిపిఎం బృందం కలిసినప్పుడు కలెక్టర్ కార్యాలయంకు పంపామని చెప్పడం అబద్ధమని స్పష్టమవుతోందన్నారు. అధికారులు కలెక్టర్ ఆదేశాలను సైతం బేఖాతర్ చేస్తూ పేదల సమస్యల పట్ల అలసత్వంగా వ్యవహించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ సమస్యపై స్థానిక ఎమ్మెల్యే కలికిరి డాక్టర్ మురళీమోహన్‌కు కూడా సిపిఎం వినతిపత్రం పంపించడం జరిగిందన్నారు. ఇకనైనా కలెక్టర్, ఎమ్మెల్యే స్పందించి యానాదులకు స్కూలు, ఇళ్ల స్థలాలు, ఇతరత్రా ప్రజాసౌకర్యాల కోసం ఆ స్థలాన్ని కేటాయించాలని కోరారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న బంగారుపాళ్యం రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అండర్ బ్రిడ్జి నిర్మాణానికి మార్గం సుగమం

హర్షం వ్యక్తం చేస్తున్న దిగువమాసపల్లె ప్రజలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు చొరవతో చిత్తూరు మండలం దిగువమాసపల్లె అండర్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి మార్గం సుగమైంది. గత రెండేళ్లుగా సరైన రోడ్డుమార్గం లేకపోవడం వల్ల దిగువమాసపల్లె ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈనేపథ్యంలో అండర్ బ్రిడ్జ్‌ను నిర్మించి తమ ప్రాంత సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఇటీవల ఆ ప్రాంత ప్రజలు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావును కలసి వినతిపత్రం సమర్పించారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎంపి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. ఇందుకు తక్షణం స్పందించిన జాతీయ రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అండర్ ప్యాసేజ్ ఫెసిలిటీ మంజూరుకు ఆమోదం తెలిపారు. దీంతో దిగువమాసపల్లె అండర్ బ్రిడ్జి నిర్మాణానికి మార్గం సుగమం అయ్యింది. రోడ్డు సమస్యకు పరిష్కారం లభించడంతో ఆ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద్ రావుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

విశ్వకర్మ యోజన శిక్షణ పూర్తి చేసుకున్న వారికి

సర్టిఫికెట్లు ప్రదానం



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, శిక్షణ పూర్తి చేసిన వారికి ఎటువంటి పూచీకత్తు లేకుండా బ్యాంక్ రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా సచివాలయంలోని మీటింగ్ హాల్‌లో ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన కింద కుప్పంలో శిక్షణ పూర్తిచేసిన చేతి వృత్తుల వారికి సర్టిఫికెట్లు ప్రధానం కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన కింద శిల్ప కళాకారులు, ధోబీ, మేస్త్రీ వంటి చేతి వృత్తుల వారికి నైపుణ్యాభివృద్ధి పెంచే శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పథకం ద్వారా ముందు రూ.15వేల విలువైన పనిముట్లు అందిస్తారన్నారు. దీనితో పాటు ఎటువంటి పూచీకత్తు లేకుండా రూ.1.50లక్షల రుణం అందించడం జరుగుతుందన్నారు. ఈ రుణాల ద్వారా చేతివృత్తిలో ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ముందడుగు వేయాలన్నారు. వచ్చే ఆదాయం నుంచి క్రమం తప్పకుండా రుణాలు తిరిగి చెల్లించాలని, అలా చెల్లిస్తే మరోసారి రుణ సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకుని బ్యాంక్‌లో దరఖాస్తు చేసుకున్నట్లైతే ఒక వారంలోపు రుణాల మంజూరుకు కృషి చేస్తామన్నారు. ఎల్‌డిఎం హరీష్ మాట్లాడుతూ పీఎం విశ్వకర్మ యోజన కింద ఎంపికై శిక్షణ పూర్తి చేసుకున్న వారికి బ్యాంకుల రుణాల చెల్లింపుకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకొని రావాలని తెలిపారు. జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి గుణశేఖర్, జిఎండిఐసి శ్రీనివాస యాదవ్, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా పరుగులు పెట్టిస్తాం.. ఎమ్మెల్యే మురళీ మోహన్




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీ మోహన్

ప్రజాశక్తి- తవణంపల్లి: పూతలపట్టు నియోజకవర్గ అభివృద్ధి కోసం అనేక ప్రాజెక్టులు ప్రభుత్వదృష్టికి తీసుకెళ్లామని ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ తెలిపారు. సోమవారం తవణంపల్లె ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసమావేశంలో మండల అభివృద్ధిపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గానికి సంబంధించి పలు కీలక అభ్యర్థనలను అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం ఎదుట ఉంచినట్లు తెలిపారు. చిత్తూరు, తవణంపల్లె, పూతలపట్టు సర్కిల్ మీదుగా ఐటీ టవర్ ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ ఐటీ టవర్ ద్వారా ఉద్యోగావకాశాలు పెరగడంతో పాటు, ఈ ప్రాంతానికి అదనపు ఆదాయ వనరులు సృష్టించే అవకాశం ఉందన్నారు. అంతేకాక, ట్రిబుల్ ఐటీ కాలేజీ ఏర్పాటుకు కూడా ప్రయత్నాలు చేపట్టామని పేర్కొన్నారు. బంగారుపాళ్యంలో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు కూడా ప్రాధాన్యతగా చూస్తున్నామని చెప్పారు. మామిడి రైతుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, మామిడి బోర్డు ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. రైతులకు స్థిరమైన గిట్టుబాటు ధర అందించేలా నిర్ణయం తీసుకోవాలని ప్రస్తావించారు. అలాగే బెంగుళూరు-తిరుపతి జాతీయ రహదారిపై ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరామని చెప్పారు. సీఎంసీ ఆసుపత్రిలో ఆరోగ్య శ్రీ కార్డు వర్తింపజేయాలని అసెంబ్లీలో ప్రతిపాదన చేసినట్లు వివరించారు. ఉపాధి హామీ పథకం కింద టెక్నికల్ వర్క్‌కు జాబ్ కార్డులు జారీ చేయాలని కూడా సూచించారు. సానుకూల ప్రతిస్పందన ప్రతిపాదనలన్నీ సానుకూలంగా స్వీకరించారని, సమగ్ర అభివృద్ధి లక్ష్యంతో పని చేస్తున్నామని చెప్పారు. ఇదే స్ఫూర్తితో ఐదేళ్ల కాలంలో పూతలపట్టు నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా పరుగులు పెట్టిస్తానని, మౌలిక, భౌతిక స్వరూపాన్ని మార్చేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు.

విద్యార్థినులు చదువుల్లో రాణించాలి

ఐద్వా ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

ప్రజాశక్తి- పలమనేరు: స్థానిక గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో సోమవారం ఐద్వా జిల్లా కార్యదర్శి భువనేశ్వరి ఆధ్వర్యంలో ఎహిళలపై జరిగే హింసను వ్యతిరేకిద్దాం.. హింస లేని సమాజాన్ని నిర్మిద్దాం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాధి బర్కత్ మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థులు మొబైల్స్, సోషల్ మీడియా, డ్రగ్స్ వంటి చెడు వ్యసనాలకు అలవాడు పడుతున్నారని ఇవి మీ జీవితాలను నాశనం చేస్తాయని వీటికి దూరంగా ఉంటే బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. మహిళలు, బాలికలపై హింస, లైంగిక వేధింపులు జరుగుతున్నాయని వీటన్నింటిని రూపుమాపటానికి విద్యార్థి దశ నుండే బాలబాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండి తగు జాగ్రత్తగా మెలగవాలని సూచించారు. హెల్త్ డిపార్ట్మెంట్ అధికారి ఉష, కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, రిటైర్డ్ ఎల్ఐసి ఉద్యోగి కుమార్‌స్వామి రెడ్డి, వ్యకాసం జిల్లా కార్యదర్శి ఓబుల్ రాజు మాట్లాడుతూ విద్యార్థినులు సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రేమ పెళ్లిళ్లుఅంటూ జీవితాన్ని నాశనం చేసుకోకుండా చదువుకొని ఆర్థికంగా ఎదిగి వారి కాళ్లపై వారు నిలబడాలని సూచించారు.



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి భువనేశ్వరి

రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెస్తాం

- చుడా ఛైర్‌పర్సన్ కటారి హేమలత

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్


ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న కటారి హేమలత

రాష్ట్రస్థాయిలో చిత్తూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ(చుడా)కి ఓ ప్రత్యేక గుర్తింపు తీసుకురానున్నట్లు ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన కటారి హేమలత తెలిపారు. స్థానిక పాత కలెక్టరేట్ ఆవరణంలోని చుడా కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి సోమవారం చుడా ఛైర్‌పర్సన్‌గా నియమితులైన కటారి హేమలత చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఐదేళ్ల పాలనలో అభివృద్ధికి నోచుకోని చిత్తూరు అర్బన్ డెవలప్మెంట్ సొసైటీని రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు వచ్చేలా అభివృద్ధి కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు. కట్టమంచి చెరువు, కాణిపాకం మొదటి ప్రాధాన్యత క్రమంలో సుందరీకరణ పనులు రూ.10లక్షలతో చేయనున్నట్లు చెప్పారు. గంగాధర నెల్లూరులో 15 ఎకరాల భూమిని అభివృద్ధి చేయడంతో పాటు పూతలపట్టులో 20 ఎకరాల భూమిని అభివృద్ధి చేసి లేఅవుట్లు వేస్తున్నట్లు తెలిపారు. తిరుపతి బెంగళూరు బైపాస్ రోడ్డు లోని కోడిగుట్ట వద్ద 25 ఎకరాల భూమిని లేఅవుట్ వేసి అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. పార్లమెంటు సభ్యులు, జిల్లాలోని శాసనసభ్యుల సలహాలు, సూచనలతో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి చుడా ఛైర్‌పర్సన్‌గా నియమించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మేయర్ అముదా, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

చుడా ఛైర్‌పర్సన్‌ను సత్కరించిన పూతలపట్టు ఎమ్మెల్యే




ఐరాల: చుడా ఛైర్‌పరసన్‌గా బాధ్యతలు స్వీకరించిన కఠారి హేమలతను పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ సోమవారం సాయంత్రం చిత్తూరు బిఆర్ గార్డెన్స్‌లోని కఠారి హేమలత నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి అభినందనలు తెలియజేశారు. అలాగే విజయం విద్యాసంస్థల అధినేత తేజామూర్తి హేమలతకి పుష్ప గుచ్చం అందించి అభినందనలు తెలియజేశారు. వీరి వెంట మాజీ జెడ్పిటిసి వెంకటేష్ చౌదరి ఉన్నారు.

వేలావడిలో సమస్యలు తిష్ట

- మరమ్మతుకు గురైన చేతిపంపు
- రోడ్డుపైనే మురుగునీరు
- వెలగని వీధిలైట్లు
- దోమలతో విషజర్వాలు

ప్రజాశక్తి- విజయపురం (నగరి)


రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

నగరి రూరల్ మండలం వేలావడిలో సమస్యలు తిష్ట వేశాయి. ఎక్కడ చూసినా చెత్తకుప్పలు, రోడ్డుపైనే మురుగునీరు దర్శనమిస్తున్నాయి. చీకటి పడితే వీధి దీపాలు వెలుగకపోవడంతో అంధకారం అములుముకుంటోంది. దీంతో స్థానికులు బయటకు రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక కరెంట్ లేదంటే తాగునీరు లేనట్టే.. ఇన్ని సమస్యలున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.. కనీసం ప్రజలు తమ సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోకపోవడం శోచనీయం


నగరి వేలావడిలో సుమారు వందకు పైగా కుటుంబాలు ఉంటున్నారు. అయితే వీరికి సరమైన మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగునీరు ప్రవహించడానికి కాలువలు లేకపోవడంతో రోడ్డుపైకి మురుగునీరు చేరి నిల్వ చేరుతోంది. దీంతో దోమలు వృద్ధి చెందడంతోపాటు దుర్వాసన వస్తోందని స్థానికులు చెబుతున్నారు. దోమలు ఎక్కువ ఉండటంతో స్థానికంగా ఉంటున్న ప్రజలు నిత్యం విష జర్వాల భారిన పడుతూ ఆసుపత్రుల చుట్టూ తిరిగాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. గత ఐదు నెలలకు తమ గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టలేదని, సమస్యలను అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతుకు గురైన చేతి పంపు

గ్రామంలోని చేతిపంపు మరమ్మతుకు గురైన సంవత్సరాలు గడిచిపోతున్నాయి. అయినా ఇప్పటి వరకు వాటిని రిపేరు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రాలేదు. కరెంట్ లేదంటే ఇక ఆ రోజు తాగునీరు లేనట్లే.. దీంతో తాగునీటికి ఇబ్బందుపడక తప్పడం లేదు. కరెంట్ ఉండి నీరు వదిలినా అంతంత మాత్రంగానే నీటిని వదులుతున్నారు.. కనీసం చేతి పంపు అయినా రిపేరు చేస్తే నీటికి ఇబ్బంది లేకుండా ఉంటుందని మహిళలు కోరుతున్నారు. బోరు రిపేరు కావడం నీరు సరిగా వదలక పోవడంతో పొలాల వద్ద వ్యవసాయ బోరులు, బావులకు పరుగులు తీయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


వీధి లైట్లు ఉన్నా వెలగవు..

గ్రామంలోని ప్రతి వీధిలో వీధి లైట్లు ఉన్నా కొన్ని వెలగని పరిస్థితి. వాటి నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంటోంది. సాయంత్రం పూట కొన్ని చోట్ల లైట్లు వెలుగకపోవడంతో బయటకు రావడానికి ప్రజలు భయపడుతున్నారు. ఊరి చుట్టూ వ్యవసాయ పొలాలు, ముళ్ల పొదలు ఉండటంతో విష సర్పాలు, కీటకాలు ఎక్కువగా ఉంటాయి. వీధి దీపాలు లేక అంధకారం అలుముకోవడంతో అడుగు బయటపెట్టాలంటే ఎక్కడ ఏ పాము ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే అదపాదడపా వర్షాలు పడుతుండటంతో లైట్లు లేక ఇంకా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. సమస్యను విద్యుత్ శాఖ అధికారులకు తెలియ జేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు.





మరమ్మతుకు గురైన చేతి పంపు / రోడ్డుపైనే చెత్తా చెదారం

ఎమ్మెల్యేకు సన్మానం


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పలమనేరు: ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని కురబ సంఘం నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. పలమనేరులోని టీడీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన కురబ సంఘం నాయకులు ఎమ్మెల్యే పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. రాష్ట్ర కురబ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్‌గా పట్టణానికి చెందిన సుబ్రమణ్యం గౌడ్‌ను నియమించడం పట్ల ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సోమశేఖర్ గౌడ్, చంద్రప్ప గౌడ్, సురేష్, మోహన్, జన, యుగంధర్, శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ విండో మాజీ అధ్యక్షులు మృతి


కాంతారావు(ఫైల్)

ప్రజాశక్తి -పూతలపట్టు: టీడీపీ మండల నాయకులు ఎర్ర చెరువుపల్లి సహకార సంఘం మాజీ అధ్యక్షులు కాంతారావు సోమవారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పరిస్థితి విషమించి మృతి చెందారు. ఈయన మృతి పట్ల ఎమ్మెల్యే మురళీమోహన్, టీడీపీ నాయకులు గోపి, దొరబాబు, గణపతి నాయుడు, మురళి నాయుడు, చంద్రమౌళి విచారం వ్యక్తం చేశారు. ఆయన లేని లోటు పార్టీకి తీరనిదని తెలిపారు.

ఆలయాల్లో సీసీ కెమెరాలు తప్పని సరి


- ఎస్ఐ సుబ్బారెడ్డి



ప్రజాశక్తి-రొంపిచర్ల: ఆలయాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్ఐ సుబ్బారెడ్డి సూచించారు. స్థానిక విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడారు. ఆలయాల భద్రత అందరిపై ఉందని తప్పని సరిగా ఆలయల్లో కెమెరాలు ఏర్పాటు చేసుకోవాల్సిన ఉందని, అందుకు నిర్వాహకులు, వివిధ ఆలయాల కమిటిలు సహకరించాలని కోరారు. దొంగతనాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు అవసరమన్నారు. స్మార్ట్ లాక్‌లు ఏర్పాటు చేసుకోవడం, ఆలయాల భద్రత దృష్ట్యా పోలీసులకు సహకరించాలన్నారు. అదేవిధంగా మసీదులలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వీటి ద్వారా దొంగతనాలను నివారించవచ్చునని తెలిపారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

- ఎంపీడీవో నారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

ప్రజాశక్తి-సోమల: మండలంలో బాల్య వివాహాలను నివారించేందుకు వైద్య, ఐసిడిఎస్ ఇతర శాఖలు సమిష్టి కృషి చేయాలని ఎంపీడీవో నారాయణ అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో వైద్య, అంగన్వాడీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు బాలాజీ, జయసింహ మాట్లాడుతూ హైరిస్క్ గర్భవతులను గుర్తించి సురక్షిత ప్రసవం చేయించాలని తల్లి బిడ్డలను కాపాడాలని బరువు తక్కువ పిల్లల్ని బుద్ధి మాంద్యం కలిగిన పిల్లలని గుర్తించి తిరుపతిలోని ఎన్ఆర్సి సెంటర్‌కి రిఫర్ చేయాలని కోరారు. అంగన్వాడి సూపర్వైజర్ హరిత మాట్లాడుతూ బాల్యవివాహాలను అరికట్టడంలో ఐసిడిఎస్ సిబ్బందికి వైద్య సిబ్బంది సహకరించి ఎప్పటికప్పుడు సమాచారాలను అందించాలని అంతేకాకుండా టీనేజ్ ప్రెగ్నెన్సీ గుర్తించి వారికి సూచనలు సలహాలు అందించాలని ఆపై సుఖ ప్రసవానికి వారికి సహకరించాలని అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లో ఆహారం అద్భుతం

- ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

ప్రజాశక్తి-కుప్పం టౌన్: అన్న క్యాంటీన్లో ఆహారం అద్భుతంగా ఉందని ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. శాసనమండలి అధ్యక్షులుగా నియమితులైన అనంతరం ఆయన మొదటిసారిగా కుప్పం విచ్చేశారు. ముందుగా పట్టణంలోని నందమూరి తారక రామారావు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్న క్యాంటీన్‌లో తానే స్వయంగా భోజనం చేసి, ఆహార నాణ్యతను తనిఖీ చేశారు. చివరగా స్థానిక టిడిపి నాయకులు ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం, టిడిపి రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు, సభ్యులు కన్నన్‌లతో కలిసి ఎమ్మెల్సీని ఘనంగా సన్మానించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ టిడిపిలో పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేసే ప్రతి ఒక్కరికి సీఎం చంద్రబాబు సముచిత స్థానం కల్పిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి ప్రొఫెషనల్ వింగ్ ఉపాధ్యక్షులు డాక్టర్ వెంకటేష్, పట్టణ అధ్యక్షులు రాజ్ కుమార్, కొత్తపేట ఇన్‌ఛార్జ్ ముఖేష్ (అప్పు), కౌన్సిలర్లు జిమ్ దాము, జాకీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పలువురు పోలీసులు బదిలీ

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: జీడీ నెల్లూరు పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న ఏఎస్ఐ ఆంజనేయులు రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ గురుస్వామి వీఆర్‌కు బదిలీ అయ్యారు. పాలసముద్రం స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్ఐ లక్ష్మి, పలమనేరు స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ గోపి, గుడిపాల స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ నవీన్‌లను జీడీ నెల్లూరు స్టేషన్‌కు బదిలీ చేశారు. వీరి ముగ్గురు సోమవారం విధుల్లో చేరారు.

అసెంబ్లీలో పలమనేరు స్వరం

- నియోజకవర్గ సమస్యలపై అసెంబ్లీలో గర్జించిన ఎమ్మెల్యే
- ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలంటూ వినతి


ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

అధ్యక్షా..

ప్రజాశక్తి- వి కోట, పెద్దపంజాణి: రాష్ట్ర అసెంబ్లీ సమావేశంలో పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి తమ నియోజకవర్గంలో ఏనుగుల దాడులు తీవ్రంగా ఉన్నాయని, గజ దాడుల వలన పంట, ప్రాణం నష్టం జరుగుతూనే ఉందని, వెంటనే సమస్యకు పరిష్కారం చూపాలి సభ దృష్టికి తీసుకువచ్చారు. నియోజకవర్గంలోని చాలా గ్రామాలు అటవీ ప్రాంతాలకు సమీపంలో ఉండటంతో ఏనుగుల దాడులు జరుగుతూనే ఉన్నాయని, వాటిని నివారించడానికి సోలార్ కంచెలు, కందకాలు గతంలో ఏర్పాటు చేసినప్పటికీ ప్రస్తుతం వర్షాలకు కందకాలు పూడిపోవడం, సోలార్ కంచెలను ఏనుగులు తొక్కివేసి మార్గాలు ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. కనుక వెంటనే సోలార్ కంచెలను పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలని, పూడిపోయిన కందకాలను మళ్లీ పునరుద్ధరించాలని, అడవుల్లో వన్య ప్రాణులకు అవసరమైన నీటి వసతి కల్పించేందుకు తగిన నిధులు మంజూరు చేయడంతోపాటు కుంకీ ఏనుగులను కర్ణాటక నుంచి తెప్పించుకున్నేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అంతేకాకుండా ఈ ప్రాంతంలో ఎకో టూరిజం అభివృద్ధి ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే అసెంబ్లీ దృష్టికి తీసుకొచ్చారు.

మండలంలోని పలు గ్రామాల్లోని పంటపొలాలపై ఏనుగులు దాడి చేసి పంటను తిని తొక్కి తీవ్ర బీభత్సవం


నియోజకవర్గంలోకి ప్రవేశిస్తున్న ఏనుగుల గుంపు(ఫైల్)

సృష్టిస్తున్నాయి. పొలాల వద్దకు వెళ్లిన రైతులు ధ్వంసమైన పంటలు చూసి కన్నీటి పర్యంతమవుతున్నారు. కీలపట్ల ఫారెస్టు బీటుకు వస్తున్న ఏనుగులు మండల పరిధిలోని పెద్దకాప్పల్లి పంచాయతీ అటవీ సరిహద్దు గ్రామాలైన కొత్తబూరగపల్లి, తిప్పిరెడ్డిపల్లి, పెద్దకాప్పల్లి, పెనుగొలకల, ముదిరెడ్డిపల్లి, గౌరీనగర్, జిట్టంవారిపల్లి, ఆకులవారిపల్లి గ్రామాల రైతుల పొలాలు అటవీ పరిసర ప్రాంతాల్లో ఉండటం వల్ల ఎక్కువగా ఆస్తి నష్టంతోపాటు పలు సందర్భాల్లో ప్రాణ నష్టం కూడా వాటిల్లుతోంది. ఇటీవలే ముదిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన అగిస్తి టమాట పంటను, జిట్టంవారిపల్లె రైతులకు చెందిన మొక్కజొన్న పంటలను ఏనుగులు తినేశాయి. ఈదాడుల్లో సుమారు రూ.50 వేల మేరకు నష్టం జరిగినట్లు అంచనా. ఏనుగుల దాడుల్లో దెబ్బతిన్న పంటలను రాయలపేట ఫారెస్టు బీటు ఆఫీసర్ రవికుమార్ ఇప్పటివరకు పరిశీలించారు. పదేపదే రైతులకు చెందిన పొలాల్లోకి ఏనుగుల గుంపు చొరబడుతూ పంటలకు తీవ్రనష్టం కలిగిస్తున్నాయి. చేతికొచ్చిన పంట ఏనుగుల వల్ల నష్టపోతున్నామంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగులు పంట పొలాల పైకి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత గ్రామస్తులు రైతులు కోరుతున్నారు.

ఏనుగల దాడులకు పరిష్కారం చూపాలి



గంగవరం మండలంలో ఏనుగుల దాడులు అధికంగా జరుగుతూనే ఉన్నాయి. ఏడాడి నాలుగైదు సార్లు చేతికొచ్చిన పంటను ఏనుగులు తొక్కి నాశనం చేశాయి. రెండు ఎకరాల్లో చేతికొచ్చిన టమోటా పంటను తిని తొక్కి పంట నష్టం సృష్టించాయి. అంతేకాకుండా మామిడి, కొబ్బరి, అరటి చెట్లను విరిచేయడంతోపాటు పొలాల వద్ద ఉన్న బోరు పరికరాలను సైతం ధ్వంసం చేస్తున్నాయి. అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న గ్రామాల వారు రాత్రివేళల్లో ఇంటికే పరిమితమయ్యే పరిస్థితు ఏర్పడ్డాయి. ఇటువంటి ప్రధానమైన సమస్యపై ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించడం హర్షించదగ్గ విషయం ఆయన చొరవతో ఏనుగుల దాడులను నివారిస్తే రైతులు, ప్రజలు సంతోషిస్తారు.

- సుబ్రహ్మణ్యం రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు

కుప్పం డిగ్రీ కళాశాలలో ప్రాంగణ నియామకాలు


ఉద్యోగులుగా ఎంపికైన విద్యార్థులు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: బిసిఎన్ విద్యాసంస్థలలో భాగమైన కుప్పం డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రాంగణ నియామకాలు నిర్వహించినట్టు కళాశాల ఉపాధ్యక్షులు సాగర్ రాజు తెలిపారు. కార్యక్రమంలో టాటా ఎలక్ట్రానిక్స్, అశోక్ లైలాండ్, ఎల్ఎస్‌టి, డెల్ఫీ టీవీఎస్, జెడ్ఎఫ్ రానే వంటి పరిశ్రమల ప్రతినిధులు పాల్గొని నియామకాలు నిర్వహించినట్టు తెలిపారు. ఈ ఎంపికలలో 249 మంది పాల్గొనగా అందులో 208మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్టు తెలిపారు. ఉద్యోగులుగా ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం అభినందించారు.

అందరికీ అందుబాటులో ఉంటా..

- జనసేన నేత డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి
- పుంగనూరులో భారీ ర్యాలీ



ప్రజాశక్తి-పుంగనూరు: నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని మీ ఆశీర్వాదం మాకు ఉండాలని ఎన్‌విఆర్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు, జనసేన నాయకుడు డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి అన్నారు. జనసేన పార్టీలో చేరిన తరువాత పుంగనూరులో జనసేన శంఖారావం పేరుతో భారీ ర్యాలీని సోమవారం నిర్వహించారు. ర్యాలీకి జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జనసేన శంఖారావం యాత్ర భారీ ర్యాలీగా బాలాజీ థియేటర్ నుంచి ప్రారంభించారు. పట్టణ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్లో అభిమానులు గజమాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి జనసేన పార్టీ ద్వారా పరిష్కరిస్తానన్నారు. ఇప్పటికే ఎన్‌వీఆర్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు, ఆలయాల పునర్నిర్మాణానికి హితోదికంగా సేవలు చేశాను అన్నారు. ప్రజలకు ఎప్పటికీ అందుబాటులో ఉండే నాయకులకు ప్రజలు కూడా గుర్తించి ఆదరించాలన్నారు. కుటమి సహకారంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేస్తానన్నారు. జనసేనలో ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానన్నారు. ప్రజా సమస్యలను గుర్తించేందుకు పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహి స్తామన్నారు. కార్యక్రమంలో తిరుపతి ఇన్‌ఛార్జ్ కిరణ్ రాయల్, సివిల్ సప్లైస్ డైరెక్టర్ శివ దత్, అపిక్ డైరెక్టర్ మైఫోర్స్ మహేష్, జనసేనా నాయకులు చిన్నారాయల్, పగడాల రమణ, శివకుమార్ రెడ్డి, విరూపాక్షి, నరేంద్రరెడ్డి, నరేష్, చైతన్య, చిన్నా, జయపాల్ రెడ్డి, భాస్కర రెడ్డి, వెంకటరమణ రెడ్డి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి త్రో బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక


అనన్య

ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఎస్ నడింపల్లి పంచాయతీ సూరయ్యగారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పి అనన్య రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక అయినట్టు హెచ్ఎం నిరంజన్ తెలిపారు. గత వారం నేతకుప్పంలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్టు వివరించారు. ఈనెల 29, 30తేదీలలో రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయులు శివకుమార్ తెలిపారు. అనన్యను పాఠశాల సిబ్బంది అభినందించారు.

ఎన్‌సీసీలో విద్యార్థులకు బంగారు పతకం


బంగారు పతకాన్ని సాధించిన విద్యార్థులు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఎన్‌సీసీలో బంగారు పతకాన్ని సాధించారు. 35 ఆంధ్రా బెటాలియన్ చిత్తూరు వారు నిర్వహించిన పదిరోజుల క్యాంపులో వివిధ అంశాల్లోన డ్రిల్, ఫైరింగ్, రిడింగ్, ఫిజికల్ ఎరుకేషన్, ఆటల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆటల పోటీలలో, వాలీబల్‌లో వివిధ పాఠశాలల నుంచి వచ్చిన ఐదు జట్టులతో పోటి పడి బైరెడ్డిపల్లి జట్టు తలపడింది. మొదటి బహుమతిని కైవసం కొంది. జట్టు ఉస్మాన, ఈశ్వర్, మైత్రీన్, అయాజ్, సందీప్, మాయిన్ బంగారు పతకాలను సాధించారని పాఠశాల హెచ్ఎం నసిజ్జాన్, ఎన్‌సిసి మాస్టర్ అయిన కే యుగంధర్, పాఠశాల సిబ్బంది విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

కలెక్టరేట్‌లో విశ్రాంతి గది ఇవ్వండి


కలెక్టర్‌కు విన్నవిస్తున్న వాహన డ్రైవర్స్ యూనియన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కలెక్టరేట్‌లో ప్రభుత్వ వాహన డ్రైవర్లకు విశ్రాంతి గది ఇవ్వాలని సోమవారం ప్రభుత్వ వాహన డ్రైవర్ల యూనియన్ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌రావు, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిత్తూరు నగర పాలక సంస్థలో హెవీ డ్రైవింగ్ మోటర్ లైసెన్స్ కలిగిన నలుగురు డ్రైవర్లకు ఉద్యోగ ఉన్నతి కల్పించాలని కోరారు.

ఆకస్మిక తనిఖీ


డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న డిపిఒ

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: జీడీ నెల్లూరు ఎంపీడీవో కార్యాలయాన్ని డిపిఒ సుధాకర్ రావు సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్వర్ణ పంచాయతీ డేటా ఆన్లైన్ వెబ్సైట్‌లో ఏ విధంగా అప్లోడ్ చేస్తున్నారు. ఒక్కొక్క డేటా ఎంట్రీకి ఎంత సమయం పడుతుంది అన్న విషయాన్ని పరిశీలించారు. అనంతరం మండలంలోని డేటా ఎంట్రీల సమావే శంలో పాల్గొని స్వర్ణ పంచాయతీ డేటాను తప్పు లు లేకుండా సక్రమంగా త్వరగతిన ఆన్లైన్ వెబ్సై ట్‌లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమ ంలో ఎంపీడీవో హరి పసాద్ రెడ్డి, పంచాయతీ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

ప్రజాశక్తి-పలమనేరు: పట్టణంలో టౌన్ హాల్ ఏర్పాటు అంశంపై ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి సోమవారం స్థానిక మున్సిపల్ అధికారులతో సమీక్షించారు. పట్టణంలో రూ.1.80కోట్లతో నిర్మించదలచిన టౌన్ హాల్‌కు సంబంధించిన బ్లూ ప్రింట్‌ను ఆయన పరిశీలించారు. అధికారులు రూపొందించిన స్కెచ్‌లో కొన్ని మార్పులు చేయాలని సూచించారు. ఈ సమీక్షలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, ఏఈ స్నేహలత, గంటావూరు అడ్మిన్ సెక్రటరీ జలంధర్ నాయుడు, టీడీపీ నాయకులు ఆర్‌వి బాలాజీ, ఖాజా, కిరణ్ తదితరులు ఉన్నారు.

వీధి కుక్కలకు వ్యాక్సినేషన్



ప్రజాశక్తి-పలమనేరు: మున్సిపల్ పరిధిలోని కుక్కలకు వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ చేపట్టారు. గంటావూరు, కెవిఎస్ స్టేట్, లక్ష్మీ నగర్, అగర్బత్తి కాలనీ తిలక్ నగర్‌లలో సోమవారం 28 వీధి కుక్కలను పట్టుకొని తిరుపతి లోని 'అనిమల్ కేర్ ల్యాండ్'కు వ్యాక్సిన్, స్టెరిలైజేషన్ కొరకు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు 687వీధి కుక్కలకు గాను, 671వీధి కుక్కలకు వ్యాక్సిన్, స్టెరిలైజేషన్ చేయించినట్టు మున్సిపల్ కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి తెలిపారు.

మూడు రోజులుగా తెరుచుకోని ఎటిఎం

ప్రజాశక్తి-సోమల: సోమలలోని యూనియన్ బ్యాంక్ ఎటిఎం మూడు రోజులుగా తెరుచుకోక మూతపడి ఉంది. నగదు డ్రా చేసుకోవాలి అనుకున్న ఖాతాదారులకు మూసి ఉన్న ఏటీఎం షెటర్ చూసి వెనక్కు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మూతపడ్డ యూనియన్ బ్యాంక్ ఎటిఎం సమస్య గురించి బ్యాంకు మేనేజర్ లక్ష్మీప్రసాద్‌ను వివరణ కోరగా సాంకేతిక సమస్య, ఒక చిన్న పార్ట్ దొరకకపోవడం వల్ల ఏటీఎం తాత్కాలికంగా మూసివేసామని రెండు, మూడు రోజులలో సమస్య పరిష్కరించి మళ్లీ యధావిధిగా సేవలు అందిస్తామని తెలిపారు. బ్యాంకు ఖాతాదారుల ఇబ్బందులను గుర్తించి వెంటనే ఏటిఎం సమస్యను పరిష్కరించాలని ఖాతాదారులు కోరారు.



షట్టర్ మూసి ఉన్న ఏటీఎం గది

కుప్పంలో గ్రీవెన్స్ సెల్ ప్రారంభం


పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ

ప్రజాశక్తి- కుప్పం టౌన్: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో సోమవారం వినతుల స్వీకరణ విభాగాన్ని ప్రారంభించారు. ఉదయం టిడిపి కార్యాలయం నందు పూజా కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. కుప్పం నియోజకవర్గ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించే ఉద్దేశంతో, వినతుల విభాగాన్ని పైలట్ ప్రాజెక్ట్ కింద ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ ప్రాజెక్టును నెల రోజుల పాటు పర్యవేక్షిస్తామని, అనంతరం వాటిలోని లోటుపాటులను తెలుసుకొని, వాటిని సరిచేసి, సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రజలకు అందుబాటులోనికి తీసుకురావడం జరుగుతుందన్నారు. డిసెంబర్ మూడో వారంలో బాబు కుప్పంలో పర్యటించే అవకాశం ఉందని, ఆయన పర్యటనలో భాగంగా కుప్పం టిడిపి కార్యాలయంలో వినతుల విభాగాన్ని ప్రారంభించడానికి చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా 12మంది సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల కమిటీ అధ్యక్షులుగా కిరణ్‌కుమార్


అధ్యక్షులుగా కిరణ్ కుమార్


ప్రధాన కార్యదర్శిగా దుర్గాప్రసాద్

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: పంచాయతీ కార్యదర్శుల సంఘం ఎన్నికల్లో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం జీడీ నెల్లూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద గ్రేడ్ వన్, గ్రేడ్ 2 పంచాయతీ కార్యదర్శులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శుల ఎన్నిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఎన్నికలకు ఎన్నికల పరిశీలకులుగా ఎంపీడీవో హరి ప్రసాద్ రెడ్డి వ్యవహరించారు. సమావేశం అనంతరం నూతన కమిటీ అధ్యక్షులుగా ముకలత్తూరు కార్యదర్శి కిరణ్ కుమార్, ఉపాధ్యక్షులుగా (నెల్లెపల్లి)సుబ్బారెడ్డి, (పాచిగుంట) కుమార్, ప్రధాన కార్యదర్శిగా వేల్కూరు కార్యదర్శి దుర్గాప్రసాద్, కోశాధికారి బాలగంగానపల్లి కార్యదర్శి శివయ్య, ఈసీ మెంబర్లుగా వై కుమార్, పి అమల, పీఎం చంద్ర, ఎం ఝాన్సీ, ఏ నిర్మల, జి శ్రీనాథ్, జి యుగంధర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన వారు పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించుకోవడానికి కృషి చేయాలని సమావేశంలో తీర్మానించారు.

ప్రజా ఆరోగ్యమే అంతిమ లక్ష్యం

కుప్పం పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ జిమ్ దాము


కిట్లను అందిస్తున్న జిమ్ దాము

ప్రజాశక్తి-కుప్పం టౌన్: పట్టణ ప్రజల ఆరోగ్యమే అంతిమ లక్ష్యంగా పారిశుధ్య కార్మికులు పనిచేయాలని పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ జిమ్ దాము కోరారు. సోమవారం తెల్లవారుజామున దోమల నివారిణ మందుల పిచికారి కిట్లను పారిశుధ్య కార్మికులకు పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఫ్లోర్ లీడర్ దాము పారిశుధ్య కార్మికులకు కిట్లను అందజేస్తూ, వారు నిర్వహించాల్సిన విధి విధానాలపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం పురపాలక సిబ్బంది కుప్పం పట్టణ పరిధిలో పిచ్చికారి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా 13వ వార్డు పరిధిలో స్థానిక టిడిపి నాయకులు కన్నన్, మణి, లోకేష్‌ల ఆధ్వర్యంలో పిచికారి కార్యక్రమం జరిగింది.

దళిత సమస్యల పట్ల ప్రత్యేక దృష్టి

- ఎంపీపీ యువరాజ్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ యువరాజ్

ప్రజాశక్తి-వి కోట: మండలంలోని దళితుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఎంపీపీ యువరాజు తెలిపారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో సోమవారం నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ పార్వతి సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు కల్పించిన హక్కుల పరిరక్షణ బాధ్యత ప్రతి అధికారిపై ఉందని తెలిపారు. గత సమావేశాల్లో దళిత నేతలు లేవనెత్తిన సమస్యల పరిష్కార వివరాలను సభ్యులకు వివరించారు. వివిధ శాఖల అధికారులు వారి వారి శాఖలలో ఎస్సీ, ఎస్టీలకు అమలు చేస్తున్న పథకాల వివరాలను తెలియజేశారు. అదేవిధంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ వి కోట మండలంలో దళితులకు సక్రమంగా శ్మశాన వాటికలు లేవని ఉన్న వాటిలో శ్మశాన స్థలాలు అక్రమణకు గురయ్యాయని, శ్మశానానికి వెళ్లే దారులను అగ్రవర్ణాలు అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సభ్యులు అందరూ దళితుల సమస్యల పరిష్కారం పట్ల అధికారులు దృష్టి సారించాలని సూచించారు. అధికారులు కూడా సభ్యుల సమస్యలను నోట్ చేసుకొని పరిష్కరిస్థామని హామీ ఇచ్చారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంపీపీ మాట్లాడుతూ.. సభ్యులు తెలిపిన సమస్యలను వచ్చే సమావేశంలోపు పరిష్కరించాలని, ప్రభుత్వ రంగ బ్యాంకులు దళితుల ఆర్థిక అభివృద్ధికి సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని కోరారు. అదే విధంగా మండలంలోని దళిత శ్మశాన వాటికలు, దళితవాడలకు దారి సమస్యలు, విద్యుత్ సమస్యలు, నీటి సమస్యలు ఉన్నాయో అక్కడ వెంటనే పరిష్కార మార్గాలు చేపట్టెందుకు మండల గ్రాంట్లో నిధులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐ సోమశేఖర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

క్యాన్సర్ భయంతో దంపతులు ఆత్మహత్య

ప్రజాశక్తి-పుంగనూరు: భర్తకు క్యాన్సర్ సోకిందని కలత చెంది ఆత్మహత్య చేసుకున్న సంఘటన పుంగనూరు మండలం మేలుందొడ్డి గ్రామంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి వివ రాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని మేలుం దొడ్డి గ్రామానికి చెందిన బి శ్రీనివాసులు(50) భార్య నీలమ్మ(47) వీరికి భార్గవి, భాను ప్రకాష్ ఇద్దరు పిల్లలు. భార్గవికి పెళ్లి అయినది. శ్రీనివాసులు కొన్ని సంవత్సరాలు టైలర్‌గా వృత్తి చేసి జీవించే వాడు. శ్రీనివాసులు టైలర్ వృత్తితో జీవనం కష్టం కావడంతో బెంగళూరుకు భార్య కుమారుడు కలిసి వెళ్లారు. గత మూడు నెలలుగా శ్రీనివాసులు అనారోగ్యంగా ఉండడంతో డాక్టర్లు చూపించిన తర్వాత క్యాన్సర్‌గా నిర్ధారించారు. అయితే శ్రీనివాసులు అక్క లక్ష్మీదేవి క్యాన్సర్ బారిన పడి చనిపోయినది. తన కుటుంబ ఆర్థిక పరిస్థితు లను, తన అక్క మరణాన్ని బేరీజు చేసుకొని బెంగళూరు నుంచి శ్రీనివాసులు, భార్య నీలమ్మ ఇద్దరూ స్వగ్రామమైన మేలుం దొడ్డికి శనివారం చేరుకున్నారు. ఆర్థిక ఆరోగ్య పరిస్థితుల తీవ్రతను అల్లునికి వివరించి మీరు సంతోషం గా ఉండాలని మేమిద్దరూ ఆత్మహత్యకు పాల్ప డుతున్నట్లు ఫోన్ ద్వారా సమాచారం అందిం చడు. ఆదివారం రాత్రి భార్యభర్తలు ఇద్దరు గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-వెదురుకుప్పం(కార్వేటినగరం): అక్రమంగా ఉంచిన నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శిరీష దేవి తెలిపారు. సోమవారం ఆమె వివ రాలను వెల్లడించారు. వెదురుకుప్పం మండలం లోని నక్కలాంపల్లె అటవీ ప్రాంతంలో సోదాలు నిర్వహించామన్నారు. యనమల మంద గ్రామంలో 1400నాటు సారా ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. కార్వేటినగరం మండలం రాజులకండ్రి గకు చెందిన ఎన్ గంగాధర్ సన్నాఫ్ ఎల్లయ్య వ్యక్తి వద్ద మూడు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. అతని వద్ద నుంచి బైక్ సీజ్ చేసినట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

మామను చంపిన కేసుల్లో అల్లుడు అరెస్ట్

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మామను చంపిన కేసులో అల్లుడిని అరెస్ట్ చేసినట్టు సిఐ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఆరు రోజులకు మునుపు గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి జంబువారిపల్లి పంచాయతీలో వాటర్ మెన్‌గా పనిచేస్తున్న కృష్ణమూర్తిని గాయపరిచారు. కేసు నమోదు దర్యాప్తు చేపట్టగా అల్లుడు కూతురు తగులాటలో సర్ది చెబుతున్నటువంటి మామపై కసి పెంచుకుని తన మిత్రులతో కలిసి హత్యకు ప్రేరేపించారని, తవణంపల్లి మండలం నరసింహ పల్లి గ్రామానికి చెందిన మునెప్ప కుమారుడు గిరిబాబుకు కృష్ణమూర్తి కూతురు నుంచి వివాహం చేశాడు. దీంతో వారి ఇరువురు తగువులాడుకొనడంతో సద్ది చెబుతున్న మామ కృష్ణమూర్తిని చూసి గిరిబాబుకు తట్టుకోలేక తన స్నేహితులైన నరసింహ పల్లి గ్రామానికి చెందిన మురగయ్య కుమారుడు పూర్ణచంద్ర చిత్తూరు ఇరువారం చెందిన అబ్దుల్ ముక్రం కుమారుడు అబ్దుల్ రావుఫ్ ఇరువురికి తెలపడంతో పై ముగ్గురు కృష్ణమూర్తికి మద్యం అలవాటు ఉండటంతో అతనిని మామిడి తోపులకి తీసుకెళ్లి మద్యం తాపించి బండరాయి బీరు బాటలతో దాడి చేసి గాయపరిచారు. అతనిని బంగాలపాలెంలో ప్రథమ చికిత్స చేపట్టి మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించి చికిత్స చేయబడుతుండగా మృతి చెందాడని తెలిపారు. పై విషయం కేసు నమోదు చేయగా ముగ్గురు నిందితులను సోమవారం అదుపులో తీసుకుని వారి వద్ద గల ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ముగ్గురు నిందితులను కోర్టుకు తరలించినట్టు తెలిపారు.